రోల్ఫ్ ష్రోయెర్స్

# 12. మార్క్ నాణెం

ముగ్గురు బిడ్డల తండ్రి అయినప్పటికీ ఆస్పత్రి కాషియరుకు పెద్ద జీతం రాదు; ఆ ఇచ్చేదైనా సంతోషంగా ఇవ్వరు, చర్మం ఒలిచి ఇచ్చినట్టుగా ఇస్తారు. ఆస్పత్రి ఆఫీసులో పని చేస్తాడు గనక అతనికి బాగా తెలుసు—ఆస్పత్రి నిర్వాహకులు మహా పొదుపుగా ఉంటారు; రోగుల సౌకర్యంకోసం చందాలు యాచిస్తారు; ఎన్నిపాట్లు పడినా ఖరీదైన మందులకు కావలసినంత సంపాదించ లేరు; ఆ మందులు అవసరమైనవే కావచ్చుగాని, తప్పనిసరి అని చెప్పడానికి లేదు. ఇది ఇలా ఉండగా, కాషియరుకు ఇతర బాధలుకూడా ఉన్నాయి. అతని చుట్టూ మందుల వాసన, తెల్లని తొడుగులు ధరించి తిరిగేవాళ్లు—వాళ్ళు నొప్పులు పోగొట్టడానికిగాను నొప్పులు కలిగిస్తారు, చచ్చినవాళ్ళు మేలుకుంటారేమో నన్నట్టుగా, నిశ్శబ్దంగా నడవలవెంట కదులుతారు.

భర్త ఆఫీసునుంచి తిరిగి వచ్చినప్పుడు నవ్వుతూ స్వాగతం ఇవ్వడం నేర్చుకున్నది ఇన్గే. తమ నవ్వుకు తామే ముచ్చటపడిపోయేవాళ్ల వికవిక నవ్వు కాదు, శాంతంగా, నోటితోకన్న హెచ్చుగా కళ్లతోనే నవ్వే నవ్వు. ఆమె తన ఆరోగ్యాన్ని బాగా కాపాడుకుంటుంది, ఎప్పుడన్నా ముఖానికి మేకప్ చేసుకుంటుంది, రోజల్లా తన ఆకతాయి పిల్లలతో సతమతమైనా, సాయంకాల మయేసరికి విధిగా నేవళంగా ఉంటుంది. అదీనూ, ఆమె తన భర్తవద్ద జీతం డబ్బులు తీసుకుని, వేరు వేరు చిన్న చిన్న సంచులలో వేసేటప్పుడు చాలా బాధ పడుతుంది—ఏ సంచిలో డబ్బు దేనికి ఖర్చు చెయ్యాలో సంచులమీద రాసిపెట్టి ఉంటుంది.

ఈ ఆదివారం కాషియర్ యొహాన్స్ ఆమె కొక అయిదు మార్కుల నాణెం ఇచ్చాడు. అతనా నాణాన్ని చప్పున జేబులోంచి తీసి, పైకి మీటి, "పట్టుకో!" అన్నాడు. ఆమె దాన్ని పట్టుకుని అతనికేసి చూసింది. ఆమెకు భయం వేసింది, క్షణంపాటు అతని పెదవులమీద కూడా ఆమెకు భయం కనిపించింది. తరవాత అతను నవ్వేశాడు.

"అది ఎగ్జిబిషనుకు. పిల్లలకోసం. పిల్లలందరూ ఎగ్జిబిషనుకు పోతారు," అన్నాడతను రహస్యంగా.

"అవును," అన్నది ఇన్గే, రహస్యంగానే.

"ఏదో అమ్మి అయిదు మార్కులు సంపాదించాను," అన్నాడతను రహస్యంగా.

నిజానికి అతను దాన్ని కాష్ రిజిస్టరులోనుంచి తీసుకున్నాడు. శనివారం సాయంకాలం—ప్రమాదమేమీ లేదు, అతని భార్యకు తెలియగూడదు, అంతే. ఆమెకు ఆ రెండోసంగతికూడా తెలియగూడదు—సోమవారంనా డతను బ్లడ్ బాంకుకు తన రక్తం ఇస్తున్నాడు. అంతా ముందుగానే ఖరారయింది. అతను రక్తం ఇచ్చినందుకు అయిదు మార్కు లిస్తారు. ఆ అయిదు మార్కులకోసం సోమవారందాకా ఆగే పనే. కాని ఆదివారంతోనే ఎగ్జిబిషను ముగుస్తున్నది. ఎగ్జిబిషనుకు పోవడానికి పిల్లలకు డబ్బుకావాలి. సోమవారంనాడు తన రక్తాన్ని ఆ డబ్బుకోసం ధారపోసేస్తాడు. ఈ ఎగ్జిబిషను బెడద లేకపోయినట్టయితే అతను ఇలాటిపని ఒక్కనాటికీ చెయ్యకపోను.

ఏమి అమ్మావని ఇన్గే అతన్ని అడగలేదు. ఆమెకాపాటి ఇంగితం ఉన్నది. అదీగాక డబ్బుతో ఆమెకు కాస్త ధీమా వచ్చింది; అలాటి ధీమాతో ఒక్కొక్కసారి కొన్నిగంటలసేపు ఆమె జీవితమంతా పూర్తిగా మారిపోతుంది. ఆమెకు బోలెడంత డబ్బువచ్చి, ఇంటిఖర్చు పద్ధతంతా పూర్తిగా మారిపోయినట్టుగా, ఆమె అలాగే, చేతిలో ఆ వెండినాణెం పట్టుకుని నిలబడి, కళ్ళుమూసుకుని, అంతులేని డబ్బుండడమంటే ఏమిటో ఊహించ యత్నించింది.

ఆమె పిల్లలను వెంటబెట్టుకుని బయటికి వెళ్లేటప్పుడు ఆమె భర్త పేపరు పట్టుకుని, సోఫామీద కాళ్ళుచాచి పడుకుని ఉన్నాడు. అతను తనలో తాను గర్విస్తున్నాడనీ, చాలా సంతోషంలో ఉన్నాడనీ, అందుకే పత్రికచాటున దాక్కున్నా

డనీ ఆమె గ్రహించింది. ఆమెకు యోహాన్స్ అంటేనూ, అతని అసహాయత్వమూ, సుఖపడాలన్న అతని దుర్బలమైన కోరికా చూస్తేనూ, ముఖ్యంగా అతని అసహాయత్వ మంటేనే ఆమె కెంతో ఇష్టం. ఆమె అతన్ని ఇంచుమించు తల్లిలాగా, తనను అస్తమానమూ అల్లరితో కాల్చుకుతినే తన పిల్లలను ప్రేమించినంతగానూ ప్రేమించేది. అతను తెచ్చిన జీతండబ్బులన్నీ తీసుకుని చిన్నచిన్న సంచులలో సర్దేటప్పుడు సైతం ఆమెకు అతనంటే ప్రేమే. ఈసారి యోహాన్స్ ఆమెమీద ఏదో తన్నావేశాడు, మహా తెలివైన తన్నా: అది ఇంకా ఆమెకు అంతుచిక్కలేదు.

పిల్లల కోరికలు తీరాయి. వాళ్ళు బిచ్చగాళ్ళకు కొంచెం ఇచ్చారు. తరవాత వాళ్ళు రంకులరాట్నపు గుర్రాలూ, కుర్చీలూ ఎక్కి తిరిగారు. ఐస్‌క్రీమ్ కాఫీలు చీకారు. వాళ్ళమ్మ రైఫిల్ స్టాండ్ దగ్గిర షూట్‌చేసేసరికి, అందరికీ తలా ఒక టోపీ వచ్చింది. పిల్లలకు అడుగడుగునా కొత్తవింతలు ఎదురవుతున్నాయి, ఎలెక్ట్రిక్ ఆర్గన్లు కీచుగా పాటలు పాడుతున్నాయి, తోలుబొమ్మలాటలో పంచ్‌గాడు తన భార్య జూడీని చావచితక గొట్టేశాడు. ఆ సమయంలో ఇన్గెకు అకస్మాత్తుగా భయంపట్టుకున్నది, అయిదు మార్కుల నాణెం తీసుకుంటూ యోహాన్స్ పెదవుల మీద భయం చూసినప్పుడులాగే. డబ్బంతా రంకులరాట్నాలమీదా, షూటింగుకూ, లాలీపాప్‌లకిందా ఖర్చయి, హారతికర్పూరంలా హరించిపోతున్నందు కామె దిగులుపడింది. అటుచూడబోతే ఇంటిదగ్గిరవాళ్ళు మార్గరీన్ (మాయవెన్న) తప్ప వాడి ఎరగరు, కడగొట్టువాడి కాళ్ల కేమీ లేవు. ఇన్గె తన విచారాన్ని అణచిపెట్టు కున్నది. ఆమెను బాధిస్తున్నది డబ్బుఖర్చుకూడా కాదు, ఇంకేదో ఉన్నది. అది చాలా అస్పష్టమైనది, ఇంచుమించు తెలియరానిది. దానికి మూలకారణం పిల్లలు గెంతుతూ, కేరుతూ ఉండడం. ఇందులో తన భర్త 'పైలాపచ్చీసు' కూడా ఉన్న దేమో కూడానూ. పిల్లలకుగాని, తన భర్తకుగాని తాను ఖర్చుచేసే డబ్బుగురించి ఏమీ తెలీదు, తనకు మాత్రమే డబ్బు సంగతి తెలుసు. వాళ్ళు అచ్చగా డబ్బే వ్యయం చెయ్యడంలేదు, ఆ రంకులరాట్నాలకిందా, చక్కెర తినుబండారాలకిందా తనలో ఒక భాగాన్నికూడా అలాములూ పలాములూ చేస్తున్నారు. ఆమె తన తల అడ్డంగాఆడించి, నుదురు తుడుచుకున్నది. ఆమె కొద్దిక్షణాలపాటు బోటుఉయ్యాలలు నడిపేవాడి కేసి చూసింది. చేతులులేని వాడి చొక్కా మడ్డిగా, నల్లగా ఉన్నది. వాడి ముఖం పెంకులాగున్నది. వాడి కండలు మొరటుగా ఉన్నాయి. వాడు తన

కేదో సంజ్ఞ చేసేదాకా, తాను వాడికేసి తేరిపారజూస్తున్నట్టు కూడా ఆమె ఎరగదు; ఆమె వెంటనే తల పక్కకు తిప్పుకుని అక్కడినుంచి కదిలింది.

మిగిలిన డబ్బును పిల్లలకు, వాళ్ళ వయసుకూ, అర్హతకూ తగిన విధంగా ఎంచి, పంచి యిచ్చి, దాన్ని వాళ్లెలా వాడుకోవాలో సలహా ఇచ్చింది. అప్పు డామెను చేపలమ్మేవాడు పలకరించాడు. వాడామెకు ప్రతి శుక్రవారమూ చాలా చౌకగా చేపముక్క అమ్ముతాడు. వాడివెంట చేపల వాసన ఉంటూ ఉంటుంది.

తన పెద్ద అరిచేతులను ఒకదానికొకటి రుద్దుకుంటూ, భుజాలు ఎత్తి నిటారుగా నిలబడి, చేపలవాడు మంచి సరదాగా మాట్లాడేస్తున్నాడు. తానుకూడా నవ్వుతూ, ఉత్సాహంగా జవాబుచెప్పడం ఇన్నేకు వినవస్తున్నది; తన గొంతు, చిన్నపిల్లల గొంతులాగా, అంతకంతకీ శ్రుతి హెచ్చిస్తూ, తారస్థాయి నందుకోవ డానికి విశ్వప్రయత్నం చేస్తున్నట్టుగా ఉన్నది. ఆమె వాడితోబాటు నవ్వుతూ, వాడి చేపలవాసన భరిస్తూ, వాడు చెప్పేది వింటూ, వాడి మాటలకు జవాబులు చెబుతూ ఉండగా పిల్లలు ఖాళీచేతులతో తిరిగి వచ్చారు. వాళ్ళ డబ్బంతా అయిపోయింది. వాళ్ళు తమ తల్లికి ఒక్క అంగ దూరంలో మాత్రమే నిలబడి, ఆమెతో తమకేమీ ప్రమేయం లేనట్టుగా శ్రద్ధగా దిక్కులు చూస్తూ, చేతులు జేబులలో దూర్చుకున్నారు.

చేపలవాడు బొకాలాటి గొంతుతో వాళ్ళను దగ్గిరికి పిలిచి, ఆఖరువాడి చేతిలో ఒక మార్కు నాణెం పెట్టి, "ఇదుగో, బుల్లాడా, ఇది పెట్టి మీరంతా ఏమన్నా కొనుక్కోండి,'' అన్నాడు.

బుల్లాడు ఆ నాణాన్ని ఆత్రంగా తన గుప్పిట్లో ముడుచుకోవడం ఇన్గే చూసింది. చప్పున ఆమెకు ఈర్ష్యవచ్చి, పిల్లవాడినుంచి ఆ నాణాన్ని లాగేసుకుని, "నేను దాచి ఉంచుతాలే. ఇంకెందుకన్నా వాడుకుందురుగాని. ఇవాళ చాలా డబ్బు తగలేశారు,'' అన్నది.

మళ్ళీ ఆమెకు తన గొంతు ఎవరిదోలాగా వినిపించింది; ఆ చేపలవాడు తన ఈర్ష్య గ్రహించగల డన్నట్టుగా వాణ్ణి చూసి సిగ్గుపడింది, నిరాశతో ముఖం ఇంత చేసుకున్న తన చిన్నవాణ్ణిచూసీ సిగ్గుపడింది. నేను భయపడుతున్నానా? దేనికని భయం? అనుకున్నదామె.

తప్పుచేసి దొరికిపోయిన దానిలాగా ఆమె చప్పున ఆ నాణెం తిరిగి ఇచ్చేసింది. బుల్లాడు దాన్ని తీసుకుని పరిగెత్తిపోయాడు. చేపలవాడు మంచిగా

నవ్వాడు. అంతలోనే ఆమెకు ఆ చేపలవాడి మీద అసహ్యం పుట్టుకొచ్చింది. ఆమె వాణ్ణి ఉన్నచోటనే వదిలేసి పిల్లవాడి వెనకాల పరిగెత్తింది.

వాడు కాస్తా ఆ నాణెం పారేసుకున్నాడు. తనతల్లి బాగా వంగి, జనం తొక్కిన గడ్డిలో వేళ్లతో వెతుకుతూ వెనక్కూ ముందుకూ పోయి వెతుకు తూంటే పిల్లాడు నిర్విచారంగానూ, నిర్లిప్తంగానూ చూస్తున్నాడు. తల్లి తన కా నాణెం పైన గల హక్కును రద్దుచేయకపోయినట్టయితే వాడు తప్పక ఏడ్చి ఉండే వాడే. కాని ఇప్పుడు వాడికి తల్లిని చూస్తుంటే కాస్త ఆనందంగానే ఉన్నది.

ఇన్గే ఎంతోసేపు వెతకలేదు. వెతికి లాభంలేదని ఆమెకు తెలుసు. అయినా ఆమె అలిసి, నీరసపడిపోయి, పిల్లాణ్ణి తిట్టింది. "నా చేతికిచ్చి ఉండగూడదూ?" అన్నదామె.

ఇంటికి తిరిగిపోయేటప్పు డామె ఆ జనం తొక్కిన గడ్డి గురించే ఆలో చించింది. తన సౌఖ్యమంతా అక్కడే పోగొట్టుకున్నట్టుగా ఆమె ఆ మార్కు నాణెం కోసం వెతికింది. ఆమెకు మళ్లీ ఆ చెవులుబద్దలయే సంగీతమూ, పిల్లల కేకలూ వినిపిస్తున్నాయి.

తరవాత, ఇంటికి చేరాక, ఆమె తన భర్తను తిట్టుకున్నది. వట్టి మూబరా మనిషి. అంత డబ్బిచ్చి ఎగ్జిబిషనుకు పంపితే బిడ్డలు తగలెయ్యడం నేర్చుకో కేంజేస్తారు? అన్నదామె. ఆ డబ్బు తాను తిరిగి అచ్చుకోవలిసి ఉన్నదని చెప్పలేని స్థితిలో ఉన్న యొహాన్స్ అయోమయంగా వ్యక్తుల సరదాలను గురించీ, జీవితం అనుభవించడం గురించీ మాట్లాడి ఆత్మసమర్థన చేసుకో జూశాడు. అయితే ఇన్గే కోపం కాస్తా తనకు అర్థంకాకుండా పెద్దరోదనంగా మారిపోయేసరికి, అతని నోరు కట్టుపడిపోయింది.